సాక్షి ప్రకాశం

ఆదివారం । 19 । జనవరి । 2025



పాకల చెదిరింది!

పాకల బీచ్‌లో భద్రతా లోపాలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సముద్ర స్నానానికి వచ్చిన వారు నీటమునిగి మృత్యువాత పడుతున్నారు. - 8లో..



ప్రజలందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర ప్రకాశం సాకారమవుతుందని కలెక్టర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 30/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు చెవిరెడ్డి, బూచేపల్లి పర్యటన

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం యర్రగొండపాలెంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. ఆరు రోజులుగా జరుగుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రికెట్ టీంల సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం తమపై పెడుతున్న తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక కొలుకుల రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో పెద్దదోర్నాల పోలీసులు నోటీసు అందజేయడంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న తప్పులను ఎత్తి చూపుతున్నామని, పండగలకు కూడా పేదలకు పైసా విదల్చని ఈ ప్రభుత్వ వైఖరిపై, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులపై రోజు రోజుకూ పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను వారు తట్టుకోలేక పోతున్నారని అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడుతున్నదన్న అక్కసుతో కూటమి నాయకత్వం పోలీస్ శాఖను పావుగా వాడుకుంటోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులపై, గెలిచిన ఎమ్మెల్యేలపై లేనిపోని అక్రమ కేసులు బనాయిస్తూ వారు రాక్షస ఆనందాన్ని పొందుతున్నారని, అందుకు నిదర్శనం పోలీసులు నోటీసులు జారీచేయడమేనని అన్నారు. ఇటువంటి కేసులు ఎన్ని బనాయించినా తాము ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటామని, ప్రజలకు అండగా ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. తమపై బనాయించిన అక్రమ కేసులపై న్యాయపరంగా ఎదుర్కొంటామని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. పోలీసులు నోటీసు జారీ చేసే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, పెద్దదోర్నాల మండల అధ్యక్షుడు గంటా వెంకటరమణారెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు.

సీసీ రోడ్డు శిలాఫలకం ధ్వంసం




ధ్వంసం చేసిన శిలాఫలకం

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికలపాడు గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ కాలువలకు సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకం దిమ్మెను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూలదోశారు. ఈ ఘటనకు సంబంధించి మంచికలపాడు సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పొన్నపల్లి సుబ్బారావు శనివారం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో సీఐ ఎం సుబ్బారావుకి ఫిర్యాదు చేశారు.

ఆగ్రో ఫారెస్ట్రీతో సుస్థిర పర్యావరణం

- డీఆర్డీఏ పీడీ రవికుమార్



ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న పీడీ రవికుమార్

ఒంగోలు వన్‌టౌన్: ఆగ్రో ఫారెస్ట్రీ సుస్థిర పర్యావరణాన్ని అందిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ రవికుమార్ పేర్కొన్నారు. అడవులకు వెలుపల చెట్లు అనే కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్లకు ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీసీలో శిక్షణ అందించారు. శిక్షణ ముగించిన వారికి శనివారం ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ రైతుల ఆదాయ వనరులను వైవిధ్యపరచడం, నేల ఆరోగ్యం మెరుగు పరచడం వంటివి ఆగ్రో ఫారెస్ట్రీతోనే సాధ్యమవుతుందన్నారు. రైతులు చెట్ల ఆధారిత పరిష్కారాలను అవలంబించడానికి ప్రోత్సహించాలన్నారు. ఆగ్రో ఫారెస్ట్రీ వ్యవసాయ రంగంలో పర్యావరణ సమతుల్యతను సాధించడానికి ఒక సాధ్యమైన మార్గంగా మారుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు పీ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి ప్రత్యూష, ఏపీ టోఫీ కోఆర్డినేటర్ ఎన్ శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు నగరపాలక సంస్థకు సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో టెండర్ల మాయాజాలం.. అధికారులు, అధికార టీడీపీ కూటమి పార్టీ నాయకులు కుమ్మక్కై దోపిడీకి తెరతీశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రానున్న మూడు నెలల్లో సుమారు రూ.25 కోట్లతో పనులు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు అనుమతులు తెచ్చుకున్నారు. దీనిపై అధికార కూటమి నేతలు కన్నేశారు. ఇతరులెవరూ పాల్గొనకుండా బెదిరింపుల పర్వానికి తెరతీశారు. ఈ పనులకు ఎక్సెస్ దాఖలు చేసి కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టేలా పన్నాగం పన్నారు.



రెండేసి.. దోపిడీకి రోడ్డేసి

ఒంగోలు నగరపాలక సంస్థ సొమ్ముకు ఎసరు

టెండర్లలో చక్రం తిప్పిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి

- అభివృద్ధి పనుల టెండర్లలో మాయాజాలం
- మూడు వర్కులు కలిపి రూ.3.35 కోట్లు
- లెస్‌లు వేసేవాళ్లను బెదిరించిన వైనం
- రెండు దరఖాస్తులే వచ్చేలా మంత్రాంగం
- నెల్లూరు పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ కార్యాలయానికి చేరిన టెండర్ల వ్యవహారం

ఒంగోలు సబర్బన్:

నగర పాలక సంస్థలో అభివృద్ధి పనుల పేరుతో దోపిడీకి రంగం సిద్ధమైంది. రానున్న రెండు, మూడు నెలల్లో దాదాపు రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అందులో భాగంగా రూ. 4.70 కోట్లతో చేపట్టనున్న 17 పనులకు టెండర్లు పిలిచారు. ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు అయినప్పటికీ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే టెండర్లు సాగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ టెండర్లలో సాధారణంగా టెండరు విలువకంటే తక్కువకు కోడ్ చేస్తూ ఉంటారు. పోటీ ఎక్కువయ్యే కొద్దీ లెస్‌లు పెరుగుతూ ఉంటాయి కూడా. ఇక్కడే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఒకరు చక్రం తిప్పారు. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా పథక రచన చేశారు. సదరు నాయకుని కనుసన్నల్లో టెండర్లు జరగటంతో కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. నగరంలోని భాగ్యనగర్–4వ లైన్ ప్రధాన రహదారి నిర్మాణాన్ని కూడా ఈ టెండర్లలో పెట్టారు. మొత్తం మూడు వర్కులు ఒకే ప్యాకేజీ కిందకు తీసుకొని మొత్తం రూ.3.35 కోట్లతో పనులు చేపట్టేలా అంచనాలు రూపొందించారు. భాగ్యనగర్ నాలుగో లైన్ ప్రధాన రహదారి నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కమాన్ వద్ద నుంచి హౌసింగ్ బోర్డులోని దామచర్ల సక్కుబాయమ్మ పాలిటెక్నిక్ కాలేజీ క్రాస్ రోడ్డు వరకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. అదే విధంగా 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మొదలు కొని వెంగముక్కల పాలెం రోడ్డు జంక్షన్ వరకు డివైడర్ ఏర్పాటుతో పాటు డివైడర్ మధ్యలో (32,33 డివిజన్ల పరిధిలో) ప్లాంటేషన్ నిర్మాణానికి రూ.75 లక్షలు, 15వ డివిజన్ పరిధిలోని రామ్ నగర్‌లో ట్రంకు రోడ్డుకు తూర్పు వైపున గ్రీన్ బెల్ట్ నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. ఈ మూడు వర్కులు కలిపి ఒకే ప్యాకేజీ కిందకు తీసుకొచ్చారు. 2024 డిసెంబర్ 26వ తేదీన టెండర్లను డౌన్‌లోడ్ చేసుకున్న కాంట్రాక్టర్లు 2025 జనవరి 9న దరఖాస్తులు దాఖలు చేశారు. అదేరోజు సాయంత్రం అధికారులు టెండర్లను తెరిచారు.



సిమెంట్ రోడ్డుకు టెండర్ పిలిచిన భాగ్యనగర్-4 వ లైన్ ఇదే..

ఇద్దరు కాంట్రాక్టర్లు లెస్‌కు టెండర్లు వేశారు...

ఒంగోలు భాగ్యనగర్–4వ లైన్‌తో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు ఏ–1 కాంట్రాక్టర్లు ఇద్దరు లెస్‌కు టెండర్లు దాఖలు చేశారని, ఆ ఇద్దరు వేసిన టెండరు దరఖాస్తులను పరిశీలన నిమిత్తం నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈకి పంపించినట్లు ఒంగోలు నగర పాలక సంస్థ మున్సిపల్ ఇంజినీర్ ఎస్.చెంచయ్య తెలిపారు. ఎస్ఈ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ నిబంధనల మేరకు టెండర్లను ఖరారు చేస్తారన్నారు. టెండర్‌లు ఎక్సెస్‌కు వేసినట్లు సమాచారం ఉందని "సాక్షి" అడగటంతో అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చారు.

4.5 ఎక్సెస్‌కి టెండరు వచ్చేలా ప్లాన్...

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువలేదన్న చందంగా అధికార పార్టీ నాయకులు తలచుకుంటే దక్కించుకోకుండా ఉండేది లేదని నిరూపించారు. తమ అనుకూలురుకు వచ్చేలా ఏర్పాటు చేసి అతని చేత 4.5 శాతం ఎక్సెస్‌కు టెండరు దాఖలు చేయించారు. రూ.కోట్ల విలువైన టెండరు కావటంతో సింగిల్ అయితే రద్దు చేస్తారని భావించిన అధికారులు, అధికార పార్టీ నాయకులు మరో డమ్మీ టెండరును కూడా వేయించారు. నెల్లూరుకు చెందిన మరో కాంట్రాక్టరు చేత 6.5 శాతం ఎక్సెస్‌కు టెండరు దాఖలు చేయించారు. అంటే టెండరు దరఖాస్తుల్లో లెస్ అయితే ఏది ఎక్కువ అయితే ఆ టెండరును పరిగణలోకి తీసుకుంటారు. అదే ఎక్సెస్ అయితే ఏది తక్కువ మొత్తంలో ఉంటే దానిని పరిగణలోకి తీసుకుంటారు. సాంకేతిక పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసుకొని మరీ టెండరు ప్రక్రియను ముగించారనే చెప్పాలి.

నెల్లూరుకు చేరిన టెండర్ కథ..

మూడు పనులకు సంబంధించి వచ్చిన కథ ఇప్పుడు నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వద్ద మొదలైంది. టెండర్ దరఖాస్తులను కార్పొరేషన్ అధికారులు అనుమతుల నిమిత్తం నెల్లూరుకు పంపించారు. సాధారణంగా రూ.10 లక్షల లోపు టెండరు అయితే నగర కమిషనర్ మంజూరు చేయవచ్చు. రూ.40 లక్షల లోపు అయితే కార్పొరేటర్లతో కూడిన స్టాండింగ్ కమిటీ అప్రూవల్ చేయాల్సి ఉంది. రూ.40 లక్షలు ఆపైన పనులకు నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈకి పంపి అనుమతి తీసుకోవాలి. దీంతో రూ.3.35 కోట్ల విలువైన పనులకు సంబంధించిన టెండరు దరఖాస్తులను నెల్లూరు ఎస్ఈకి పంపించారు. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు, సదరు కాంట్రాక్టర్ నెల్లూరు ఎస్ఈ కార్యలయానికి చేరుకుని తెరవెనుక మంత్రాంగాన్ని నడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ పనులకు సంబంధించిన పర్సెంటేజీల వ్యవహారం సైతం నడుస్తోందని విశ్వసనీయ సమాచారం.



ఎన్టీఆర్ కళాపరిషత్ వారోత్సవాలు శనివారం ఒంగోలు పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. వివిధ కళారూపాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. - సాక్షి, ఒంగోలు

భూముల మార్కెట్ వాల్యూ రివిజన్‌కు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు అర్బన్: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని భూములు, ఇళ్ల స్థలాల విలువల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు జిల్లా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ చైర్మన్ జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భూములు, ఇళ్లస్థలాల విలువల్లో మార్పులు, చేర్పులు చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. జిల్లా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పలు మార్లు సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అందులో భాగంగా తాత్కాలికంగా ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖకు చెందిన కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ సర్క్యులర్ నంబర్ ఎంవీ/752/2022 తేదీ 31/12/2024 ఉత్తర్వుల ప్రకారం తాత్కాలిక ఆమోదం తెలిపామన్నారు. తాత్కాలికంగా భూములు, ఇళ్ల స్థలాల విలువల్లో మార్పులు, చేర్పులు చేయటానికి ఆమోదం పొందిన ప్రతిపాదనలపై ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారన్నారు. అందుకోసం ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక మార్కెట్ వాల్యూ ప్రతిపాదనలకు సంబంధించి ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, మండల తహశీల్దార్ కార్యాలయాల్లో, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలతో పాటు కలెక్టర్ కార్యాలయం కూడా నోటీసు బోర్డుల్లో ప్రజల అభ్యంతరాల కోసం ఉంచారన్నారు. సదరు మార్కెట్ వాల్యూ ప్రతిపాదనలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌కు స్వయంగా కానీ, పోస్టు ద్వారా కానీ లేదా ఐజీఆర్ఎస్ వెబ్ సైట్ ద్వారా కానీ ప్రజలు అభ్యంతరాలను వెలిబుచ్చవచ్చని చెప్పారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు



బాలుర విభాగంలో మొదటి బహుమతి సాధించిన ప్రకాశం జట్టు



బాలికల విభాగంలో రెండో బహుమతి సొంతం చేసుకున్న ప్రకాశం జట్టు

- హోరాహోరీగా ఫైనల్ పోటీ
- బాలుర విభాగంలో మొదటి బహుమతి ప్రకాశం జట్టు కైవసం
- బాలికల విభాగంలో ఈస్టుగోదావరి విజయకేతనం

పొదిలి రూరల్: పొదిలి ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీలకు వివిధ జిల్లాల నుంచి బాలురు, బాలికలు కలిపి మొత్తం 32 జట్లు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నంద్యాలలో జాతీయ స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. శనివారం నిర్వహించిన సెపక్‌తక్రా పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం–కర్నూలు జట్లు నువ్వా–నేనా అన్న విధంగా తలపడ్డాయి. ఈ పోరులో ప్రకాశం జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి ప్రకాశం జట్టు, రెండో బహుమతి కర్నూలు జట్టు సొంతం చేసుకున్నాయి. మూడో బహుమతికి అనంతపురం, ఈస్టుగోదావరి జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకోగా, రెండో బహుమతిని ప్రకాశం జిల్లా జట్టు సొంతం చేసుకుంది. మూడో బహుమతికి విజయనగరం, అనంతపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జీ శ్రీనివాసులు, అమరనాథ్, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బంతి కోసం గాలిలో ఎగురుతున్న కర్నూల్ కుర్రోడు

ఎస్సీ బాలుర హాస్టల్ మూసివేత

- రహస్యంగా హాస్టల్ సామగ్రి తరలింపు
- గ్రామస్తులు అడ్డుకోవడంతో సామగ్రి తరలింపు నిలిపివేత



పొన్నలూరులోని ఎస్సీ బాలుర హాస్టల్ నుంచి సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

పొన్నలూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం పొన్నలూరులో 2016 లో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాస్టల్‌లో చేరి స్థానిక ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వసతి గృహం ఏర్పాటు చేసింది మొదలు ప్రతి ఏడాది సిబ్బంది గ్రామాల్లో ప్రచారం నిర్వహించి తగినంత మంది విద్యార్థుల సంఖ్య పెంచారు. వసతి గృహం అద్దె భవనంలో ఏర్పాటు చేసినప్పటికీ 8 ఏళ్ల పాటు చుట్టు పక్కల విద్యార్థులకు వసతి ఇచ్చి చదువుకోవడానికి అవకాశం కల్పించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో మొదట మూడు నెలలు హాస్టల్‌ని నిర్వహించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వలన సరిపడిన విద్యార్థుల సంఖ్య లేదంటూ ఇటీవల హాస్టల్‌ని పూర్తిగా మూసివేశారు. హాస్టల్ మూసివేయడానికి ప్రధాన కారణం రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం. పీసీపల్లె హాస్టల్‌కు చెందిన వార్డెన్‌ని ఇన్‌చార్జిగా నియమించడంతో విద్యార్థులకు సరైన అవగాహన కల్పించలేదు. ఫలితంగా కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. సరిపడినంత మంది విద్యార్థులు లేరంటూ గత నెలలో మూసివేశారు. దీంతో వారిలో కొంత మంది కందుకూరు హాస్టల్‌లో, మరికొందరు లింగసముద్రం, వలేటివారి పాలెం హాస్టళ్లలో చేరారు. వాస్తవంగా హాస్టల్ వార్డెన్, సిబ్బంది గ్రామల్లో పర్యటించి విద్యార్థుల సంఖ్యను పెంచి అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

రహస్యంగా సామగ్రి తరలింపు...

ఇదిఇలా ఉంటే పొన్నలూరులో హాస్టల్‌ను మూసివేసిన సంగతి చాలా మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియదు. ఈ క్రమంలో హాస్టల్ మూసివేతపై ఉన్నతాధికారులు ఆదేశాలు పూర్తి స్థాయిలో లేనప్పటికీ సిబ్బంది రహస్యంగా హాస్టల్‌లోని సామగ్రిని తరలించడానికి పూనుకున్నారు. శనివారం ఉదయం వంట పాత్రలను ఆటోలో తరలించగా, ఆ తరువాత విద్యార్థుల పెట్టెలు ఇతర సామగ్రిని కనిగిరి హాస్టల్‌కు తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై ఇన్‌చార్జి వార్డెన్‌ను వివరణ అడుగగా ఉన్నతాధికారుల సూచన మేరకు మళ్లీ సామగ్రిని హాస్టల్‌లో పెట్టించామని, హాస్టల్ మూసివేతపై ఉన్నతాధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 7,184 మంది హాజరు

ఒంగోలు సిటీ: జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశించేందుకు శనివారం నిర్వహించిన పరీక్షకు 7,184 మంది హాజరైనట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష మొత్తం 25 సెంటర్లలో నిర్వహించారన్నారు. మొత్తం 13,765 మంది విద్యార్థులకు గాను, 7,184 మంది హాజరుకాగా, 6,581 మంది గైర్హజరైనట్లు చెప్పారు. మొత్తం 16 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు.

నవోదయ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈఓ

పొదిలి రూరల్: పొదిలిలో జరుగుతున్న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాలను శనివారం డీఈఓ కిరణకుమార్ పరిశీలించారు. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 887 మంది విద్యార్థులకు గాను 426 మంది హాజరయ్యారు. 461 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాతంగా జరిగాయి. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో జీవో 117 రద్దు పై కనిగిరి డివిజన్ ఎంఈఓలు, కాంప్లెక్స్ చైర్మన్లకు నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. ఈనెల 23న కమిషనర్ ఒంగోలు వస్తుండడంతో 21, 22 తేదీల్లో కమిటీలు స్కూల్‌ను పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. 1, 2 తరగతులను అంగన్‌వాడీ ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్, 60 మంది కంటే పిల్లలు ఎక్కువ ఉంటే మోడల్ స్కూల్‌గా, 30 మంది కంటే తక్కువగా ఉన్న స్కూలును గుర్తించాలన్నారు.



పొదిలిలో ఎంఈఓల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

బీసీల సమస్యల పరిష్కారానికి కులగణనే కీలకం

మార్కాపురం: బీసీల సమస్యల పరిష్కారానికి కులగణనే కీలకం కానుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే శంకరరావు అన్నారు. మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు రాష్ట్ర స్థాయిలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నా, జాతీయ స్థాయిలో రోహిణీ కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా కులగణన చేయాల్సిందేనన్నారు. కేంద్రంలో ప్రత్యేకంగా ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి సబ్‌ప్లాన్ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన విషయంలో తాత్సారం చేయడం తగదన్నారు. గతంలో మోదీతోపాటు అమీత్‌షా, రాజ్ నాథ్ సింగ్‌లు జనగణనతోపాటు కులగణన కూడా ప్రత్యేక ఫార్మెట్ చేయిస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కే క్రాంతి కుమార్, మార్కాపురం గౌడ సంఘం అధ్యక్షుడు గజా రమణ, గౌడ భవన్ చైర్మన్ ఇల్లూరి రంగస్వామి, రంగ నాయకులు, కాశయ్య, రంగారావు, బత్తిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరరావు

క్లుప్తంగా

పెట్రోలు బాటిల్ పేలి బాలుడికి గాయాలు



గాయపడిన అభిరామ్

ముండ్లమూరు (దర్శి): పెట్రోలు బాటిల్ పేలి బాలుడికి గాయాలైన సంఘటన ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోలవరం గ్రామానికి చెందిన పిల్లలు సరదాగా టపాసులు పేల్చుకుంటూ ఆడుకుంటున్నారు. ఆ సమయంలో వారికి దొరికిన పెట్రోలు బాటిల్లో టపాసుల ఒత్తి పెట్టి ముట్టించారు. దీంతో పెట్రోలు బాటిల్ ఒక్కసారిగా పేలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో జమ్మలమూడి అభిరామ్ అనే బాలుడి శరీరం కాలిపోయి గాయాలయ్యాయి. పొట్ట, వీపునకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మంటలార్పి ముండ్లమూరు ప్రభుత్వాస్పత్రికి బాలుడిని తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. గాయాలు తట్టుకోలేక బాలుడు విలవిల్లాడిపోయాడు.

టీకాల సమాచారం పక్కాగా ఉండాలి

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



నిల్వ ఉంచిన టీకాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నాగులుప్పలపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల సమాచారం ఎప్పటికప్పుడు పక్కాగా ఉండేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు అన్నారు. అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో ఆస్పత్రిలో నిల్వ ఉంచిన టీకాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో విధిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, శిశువులకు అందించాల్సిన సేవలు వయసును బట్టి సకాలంలో అందించాలని సూచించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను ప్రభుత్వం సరఫరా చేసిన ఉపకరణాలన్నీ వినియోగించి ప్రజలకు సేవ చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తప్పక సమయపాలన పాటించాలన్నారు.

బైకుల దొంగకు 14 రోజుల రిమాండ్

పీసీ పల్లి: మండల పరిధిలోని చినగురుమడుకు చెందిన కొడవటికంటి అజయ్‌కుమార్ ఇటీవల కాలంలో గోపవరపువారిపల్లి, పెదయిర్లపాడు గ్రామాల్లో బైకులు దొంగిలించాడు. ఈ నెల 16వ తేదీ కేసు నమోదు చేసి ఎస్సై కోటయ్య.. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సీబీజెడ్, హోండా షైన్ బైకులు రెండింటిని బుడ్డారెడ్డిపల్లి గ్రామం వద్ద రికవరీ చేసి అరెస్టు చేశారు. శనివారం కొడవటికంటి అజయ్‌కుమార్‌ను కనిగిరి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ దొంగతనాల్లో గోచిపాతల వినోద్ అనే వ్యక్తి కూడా పాల్గొన్నట్లు తేలడంతో త్వరలో అతన్ని కూడా పట్టుకుని రిమాండ్‌కు పంపిస్తామన్నారు. తాగుడు, డ్రగ్స్‌కు బానిసలై వీరు దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై మార్టూరు మండలంలోని ఇసుకదర్శి గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుకదర్శి గ్రామానికి చెందిన దోరక నాగిరెడ్డి (54) స్థానిక ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొని కాలినడకన ఇంటికి వెళ్తున్నాడు. జాతీయ రహదారిలో తూర్పు వైపు నుంచి పడమర వైపునకు దాటుతుండగా మార్టూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

పాకల చెదిరింది..!

పాకల బీచ్ కళ తప్పింది. ఎప్పుడూ ఆహ్లాదకరంగా కనిపించే ఈ బీచ్ ప్రస్తుతం కళావిహీనంగా కనిపిస్తోంది. సంక్రాంతి సెలవుల సందర్భంగా గత గురువారం బీచ్‌కు భారీగా వచ్చిన పర్యాటకుల్లో ఐదుగురు గల్లంతై నలుగురు మృతిచెందారు. ఒకరిని కాపాడారు. మృతుల కుటుంబాల్లో పెను విషాదం నింపిన ఈ సంఘటనతో పాకల బీచ్‌లో పర్యాటకులకు భద్రత లేదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. పోలీసులు, మెరైన్ సిబ్బంది నిర్లక్ష్యంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

- పాకల బీచ్‌లో నలుగురు మృతిచెందడంతో తీవ్ర విషాదం
- తాము కన్న కలలన్నీ చెదిరిపోయి కోలుకోలేకపోతున్న బాధిత కుటుంబాలు
- ఒక్కసారిగా కళావిహీనంగా మారిన పాకల బీచ్
- బీచ్‌లో భద్రతపై పలు అనుమానాలు
- 2023 జనవరిలోనూ ఒకరు మృతి, మరొకరు సురక్షితం
- కడ్సలే కారణమంటున్న మత్స్యకారులు
- పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- సంక్రాంతికి భారీగా పర్యాటకులు వస్తారని తెలిసినా బందోబస్తు, ముందు జాగ్రత్త చర్యల్లో పోలీసులు విఫలం



పర్యాటకులు లేక బోసిపోతున్న పాకల బీచ్



2023లో పాకల బీచ్‌లో గల్లంతై మృతి చెందిన షేక్ అబ్దుల్ అమాద్ (ఫైల్)



బతికిబయటపడిన షేక్ అబ్దుల్ అమల్ (ఫైల్)



పాకల బీచ్‌లో మూతబడిన దుకాణాలు

సింగరాయకొండ:

సముద్ర స్నానాలు, ఆహ్లాదం కోసం పాకల బీచ్‌కు వచ్చే పర్యాటకుల భద్రతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ మార్పులతో పాకల తీరంలో ఏర్పడే కడ్సల కారణంగా ప్రాణాపాయం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. సుడిగాలులను మత్స్యకార భాషలో కడ్సలు అంటారు. పాకల బీచ్‌లో ఉన్న చిన్న చిన్న గుంతల కారణంగా ఈ కడ్సలు ఏర్పడతాయని, వీటిలో చిక్కుకున్న వారు తప్పించుకోవడం కష్టమని మత్స్యకారులు చెబుతున్నారు. కేవలం సమయస్ఫూర్తితో మాత్రమే తప్పించుకోగలరని అంటున్నారు. ప్రస్తుతం పాకల తీరంలో అలల ఉధృతి అధికంగా ఉంది. పైగా, ఇక్కడ సముద్రం లోతు కాస్త ఎక్కువే. వీటికితోడు గత గురువారం తీరంలో కడ్సల కారణంగా ప్రమాదం జరిగింది. పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీ శివన్నపాలేనికి చెందిన నోసిన జెస్సికా, నోసిన యామిని, కందుకూరు మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన కొండాబత్తిన యామిని, సింగరాయకొండ మండలానికి చెందిన తమ్మిశెట్టి పవన్‌కుమార్ మృతిచెందారు. శివన్నపాలేనికి చెందిన నోసిన నవ్య సమయస్ఫూర్తితో కడ్స బారి నుంచి తప్పించుకుని అలలపై తేలుతుండగా, మత్స్యకారులు, మెరైన్ పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆమెను కాపాడారు.

గతంలోనూ కడ్సల కారణంగా ఒకరు మృతి...

2023 జనవరి 29వ తేదీ సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ అమీద్ సిద్దిక్ కొడుకు అబ్దుల్ అమాద్ (15), కూతురు అబ్దుల్ అమల్ (14) తమ బంధువులతో కలిసి పాకల తీరానికి సముద్రస్నానానికి వచ్చారు. వారిద్దరినీ కడ్స చుట్టుముట్టింది. ఈ ఘటనలో అమాద్ మృతి చెందగా, అమల్‌ను మత్స్యకారులు కాపాడారు. మళ్లీ రెండు సంవత్సరాల తర్వాత గత గురువారం కడ్సల కారణంగా నలుగురు మృతి చెందడంతో పాకల బీచ్‌లో భద్రత లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులు, మెరైన్ సిబ్బంది...

పాకల బీచ్‌కి ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా మూడునాలుగు రోజుల పాటు భారీగా పర్యాటకులు తరలివస్తారు. ప్రతిరోజూ 10 వేల నుంచి 15 వేల మంది వరకూ వస్తారని అంచనా ఉన్నప్పటికీ.. అందుకు తగ్గట్టుగా బందోబస్తు ఏర్పాటు చేయకుండా పోలీస్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో వినాయకచవితి పండుగ నిమజ్జనాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పాకల తీరంలో హెచ్చరికలతో కూడిన జెండాలు పాతించారు. ఆ జెండాలు దాటి ఎవరూ లోపలకు వెళ్లకుండా మైకుల ద్వారా హెచ్చరించారు. ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే కాపాడేలా సిబ్బందిని సిద్ధం చేశారు. కానీ, సంక్రాంతి సెలవుల్లో మాత్రం పర్యాటకుల భద్రత కోసం స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఆరుగురు సిబ్బందిని బందోబస్తు పెట్టగా, బుధవారం రాత్రి టంగుటూరులో జరిగిన తెప్పోత్సవానికి ముగ్గురు సిబ్బంది వెళ్లారు. ఆ ముగ్గురూ గురువారం విధులకు రాలేదు. మిగతా ముగ్గురిలో ఒకరిని ఉన్నతాధికారి సొంతపనిమీద పంపించారు. గురువారం వచ్చిన 10 వేల మంది పర్యాటకులను కేవలం ఇద్దరు సిబ్బంది పర్యవేక్షించలేక చేతులెత్తేశారు. బందోబస్తులో ఉండాల్సిన ఎస్సై, ఏఎస్సై ఎక్కడికి వెళ్లారో కూడా ఎవరికీ తెలియదు. దుర్ఘటన జరిగిన వెంటనే ఏఎస్సై రాగా, ఆ తర్వాత ఎస్సై వచ్చారు. సంఘటన జరిగిన తర్వాత తీరానికి వచ్చిన ఎస్పీ దామోదర్ భద్రత విషయమై మెరైన్ ఎస్సైపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పోలీసులు, మెరైన్ పోలీసులు పూర్తి స్థాయిలో బందోబస్తు నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టడం, పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం చేసి ఉంటే గురువారం ఆ దుర్ఘటన జరిగి ఉండేది కాదని పర్యాటకులు చెబుతున్నారు. ఇకనైనా ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని పాకల తీరంలో పర్యాటకులకు భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బీచ్‌కి విరామం...

పాకల బీచ్‌కి నాలుగు రోజుల పాటు పర్యాటకులు రాకుండా విరామం ప్రకటిస్తున్నట్లు సింగరాయకొండ సీఐ హజరత్తయ్య తెలిపారు. గత గురువారం బీచ్‌లో నలుగురు చనిపోవడంతో పాటు అలల ఉధృతి తగ్గకపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా విరామం ప్రకటించినట్లు వివరించారు. పర్యాటకులు బీచ్‌కి వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడి వరకూ వచ్చిన వారిని కూడా వెనక్కు పంపిస్తున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో అక్కడి వరకూ వచ్చిన వారు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్తున్నారు. సందడి లేకపోవడంతో పాకల తీరం వెలవెలబోతోంది.



పాకల బీచ్‌కి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతుడు నాగయ్య

కొనకనమిట్ల: ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన 565వ నంబర్ జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం చౌటపల్లి ఎస్సీకాలనీ వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. చౌటపల్లి ఎస్సీకాలనీకి చెందిన చిరుగూరి నాగయ్య (65) ఉదయాన్నే పాల కోసం పక్కనే ఉన్న బస్టాండ్ సెంటర్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో మార్కాపురం వైపు నుంచి వచ్చిన ట్రాలీ ఆటో వెనుక నుంచి నాగయ్యను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాలీ ఆటో డ్రైవర్ ఆటోను అక్కడే వదిలేసి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. మృతుడు నాగయ్యకు భార్య విజయమ్మ, ఐదుగురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న కొనకనమిట్ల ఎస్‌ఐ రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం నాగయ్య మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాత్‌రూంలో కాలు జారి పడి..



మృతిచెందిన బొమ్మిని లక్ష్మమ్మ

- వృద్ధురాలు మృతి

కొమరోలు: బాత్‌రూంలో కాలుజారి పడి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన కొమరోలు మండలంలోని తాటిచెర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. తాటిచెర్ల గ్రామానికి చెందిన బొమ్మిని లక్ష్మమ్మ (70) తన ఇంట్లోని బాత్‌రూంలోకి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి కాలు జారి కిందపడింది. తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. బాత్‌రూం నుంచి పెద్ద శబ్దం రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లక్ష్మమ్మను ఓ ప్రైవేటు వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు కూడా గతంలో ఇంటి మెట్లు దిగుతూ కాలుజారి కిందపడి మృతిచెందాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రజలందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

- స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్‌ను ఒక ఉద్యమంలా చేపట్టాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు




ఎస్‌ఎస్ ట్యాంకు పరిసరాల్లో చెత్త తొలగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే, మేయర్

ఒంగోలు సబర్బన్: ప్రజలందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన ప్రకాశం జిల్లా ఆవిష్కృతమవుతుందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. ‘స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్’లో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు నగరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. స్థానిక మామిడిపాలెంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు–1 చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అక్కడి యోగా సెంటర్ వద్ద ముళ్లచెట్లను తొలగించి శుభ్రం చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ప్రతి నెలా మూడో శనివారం ‘స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్’ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. స్థానిక ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను, వివిధ వర్గాల ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లా నిలిచేలా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సంపన్నవంతమైన ప్రకాశం జిల్లా ఆవిష్కరణకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకరరెడ్డి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు కె.వెంకటరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల జీవో విడుదల చేయాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే తెలుగు, హిందీ, సంస్కృతం, పీఈటీలకు పదోన్నతి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్‌లో సర్వీస్ పాయింట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే అన్ని రకాల సదుపాయాలను ఎయిడెడ్ విద్యార్థులకు కల్పించాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల అరియర్స్ చెల్లించాలన్నారు. జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను శాశ్వతంగా ప్రభుత్వ పాఠశాలలకు కౌన్సెలింగ్ ద్వారా సర్దుబాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి పైనతెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించి ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

- మరొకరికి గాయాలు



గాయపడిన ప్రశాంత్‌కుమార్‌ను జీజీహెచ్‌కి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది



రైతు పొందూరి ప్రసన్న మృతదేహం

జరుగుమల్లి (సింగరాయకొండ): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ప్రమాదవశాత్తూ మోటారు సైకిల్ ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై జరుగుమల్లి మండల పరిధిలోని బీకే క్రషర్ కంపెనీ సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో కె.బిట్రగుంట గ్రామానికి చెందిన వృద్ధుడు పొందూరి ప్రసన్న (70) తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందగా, మోటారు సైక్లిస్టు యాసవరపు ప్రశాంత్‌కుమార్‌కు గాయాలయ్యాయి. రైతు అయిన ప్రసన్న పొలం పని చేసుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. మోటారు సైకిలిస్టు ప్రశాంత్‌కుమార్‌ది నెల్లూరు జిల్లా బోగోలు మండలం కమ్మపాలెం గ్రామంలోని అరుంధతివాడ కాగా, విజయవాడలోని ఓ ప్రైవేటు కంపెనీలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామం నుంచి మోటారు సైకిల్‌పై విజయవాడ వెళ్తూ ప్రమాదవశాత్తూ వృద్ధుడిని ఢీకొట్టాడు. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఫెన్సింగ్ దిమ్మెను బలంగా ఢీకొట్టింది. ప్రశాంత్‌కుమార్ తల ఫెన్సింగ్ దిమ్మెకు తగిలింది. తలకు హెల్మెట్ ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడని, లేకపోతే ప్రాణాపాయం సంభవించేదని హైవే పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్సై బి.మహేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించి గాయాలపాలైన ప్రశాంత్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్ ల్యాబ్ టెక్నీషియన్‌పై కత్తితో దాడి

- అతని వేధింపులు తాళలేక దాడి చేసినట్లు చెబుతున్న యువతి
- ఆ యువతి వేధింపులు తట్టుకోలేక ఫోన్ నంబర్ బ్లాక్ చేసినందుకు దాడి చేసిందంటూ యువకుడి ఫిర్యాదు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్‌పై ఒక యువతి కత్తితో దాడిచేసిన సంఘటన ఒంగోలు జీజీహెచ్‌లో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... పుల్లలచెరువు మండలం పెద పీఆర్‌సీ తండాకు చెందిన బాలునాయక్ ఒంగోలు జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెంది అతనికి వరసకు అక్క అయ్యే మహిళ కూతురైన యువతి నగరంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా పనిచేస్తోంది. ఇద్దరిదీ ఒకే ఊరు కావడంతో సన్నిహితంగా మెలుగుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి బాలునాయక్ జీజీహెచ్‌లో డ్యూటీ చేస్తుండగా, సదరు యువతి వైద్యశాలకు వచ్చింది. వారిద్దరి మధ్య ఏం జరిగిందో ఏమోగానీ కొంతసేపటి తర్వాత అతడిపై కత్తితో దాడి చేసింది. ఈ దాడిలో బాలునాయక్ తల, కంటి పక్కన స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతడిని జీజీహెచ్‌లోని అత్యవసర వార్డుకు తరలించి వైద్యం చేశారు. తనకు ఇటీవల వివాహమైందని, ప్రస్తుతం తన భార్య గర్భిణి కావడంతో కాన్పు కోసం పుట్టింటికి వెళ్లి ఉందని, ఈ సమయంలో రోజూ ఫోన్లు చేసి సదరు యువతి వేధిస్తుండటంతో ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశానని బాలునాయక్ తెలిపాడు. అది మనసులో పెట్టుకుని తనపై ఆ యువతి కత్తితో దాడి చేసిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, దాడి చేసిన యువతి కూడా తనను బాలునాయక్ ఫోన్లు చేసి వేధిస్తున్నాడని, విసుగుచెంది దాడి చేశానంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారిద్దరి ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజు తెలిపారు.

పునశ్చరణ తరగతులతో ఎంతో ఉపయోగం



ఏఆర్ సిబ్బంది పునశ్చరణ తరగతులను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తుచేసుకుని మరింత కీలకంగా పనిచేసేందుకు పునశ్చరణ తరగతులు ఎంతో దోహదం చేస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని కవాతు మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు పునశ్చరణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు 15 రోజులు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసంగిస్తూ వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు బలమైన శక్తిగా పోలీసు శాఖకు ఉపయోగపడుతున్నారని చెప్పారు. నిబద్ధత, నిజాయితీగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. రిజర్వ్ పోలీసులు వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఆయుధాల నిర్వహణ, ఉపయోగంతో పాటు ఫైరింగ్, డ్రిల్, మార్చ్ ఫాస్ట్, మాబ్ కంట్రోలు, వీవీఐపీ ఎస్కార్ట్, పీఎస్‌ఓ, బాంబు స్క్వాడ్, బందోబస్తు విధులు, తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య పరిరక్షణ, సైబర్ నేరాలు, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకునేందుకు ప్రణాళికలకు సంబంధించిన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏఆర్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, డీపీఓ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.